# చిలిమంటలు

## అవధానుల విజయలక్ష్మి

కుంచెని రంగులో ముంచి కాన్వాసు మీద మొదటి గీత గీసినప్పట్నించీ ఈ పదిహే నేళ్ళలోనూ ఇంత మథనపడలేదెప్పుడూ!

ఓ కొంగ నీటి ఒడ్డున నిల్చొని తన నీడ చూసుకుంటున్నప్పుడో...ఓ కన్నెపిల్ల కొంగు బిగించి ముగ్గులేసుకొంటున్నప్పుడో... ఓ బోసినోటి మామ్మ చంకలోని పసి పిల్లాడికి ఆకాశంలోని చందమామని చూపెడుతున్నప్పుడో వేసిన బొమ్మలన్నీ నా కోసం! నా మనసుకోసం! పత్రికలో కథ చదివి దానికి బొమ్మ వేసినప్పుడో... పండుగకి కార్టూన్లు వేసినప్పుడో... ఓ మోడల్‌ని కూర్చోపెట్టి పోర్ట్రెయిట్ వేసినప్పుడో అదీ నాకోసమే! నా పొట్టకోసం! కానీ... ఇన్నేళ్ళ తర్వాత మొదటిసారిగా 'నా కోసమేనా? అన్నీ నా కోసమేనా?' అన్న ప్రశ్న మనసుని దొలవడం మొదలెట్టింది.

ఆ ప్రశ్న అంతై ఇంతై అనుక్షణం నన్ను వెక్కిరిస్తూనే వుంది.

నేను వేసే ఓ బొమ్మ ఒక్కరివైనా కదల్చగలిగితే?

ఓ చిన్న కదలిక... కంటి రెప్పల వెనక దాగిన కన్నీటిలోనో... గుండెలో కనిపించకుండా దాగొన్న ఓ మూలలోనో... మెదడు అట్టడుగు పొరల్లోనో... అది చాలు నాకు!

కాని ఆ చిన్న కదలిక పుట్టించడం కోసం నా చుట్టూ వున్న ఈ చిన్న ప్రపంచాన్ని చూస్తే చాలదనిపిస్తోంది.

ఇంకా చేన్నో చూడాలి. ఇంకా ఏవో కొత్త అనుభూతులనో...ఆలోచనలనో మనసులో ఇంకించుకోవాలి.

అప్పుడే నా కుంచెకు నేను న్యాయం చెయ్యగలను. నాకు కావలసిన నా ప్రపంచం గురించి వెతుక్కొంటున్నప్పుడు గుర్తొచ్చాడు హిమాంశు.

ఎక్కడో దూరంగా...పల్లే పట్నమూ కాని ఊర్లో వుంటున్నాడతను. వారానికోసారి వచ్చే అతని ఉత్తరాల నిండా అతని ఊరిని గురించిన విషయాలే!

అన్ని కిలోమీటర్ల దూరమూ మిల్లీ మీటర్లకి తగ్గిపోతుంటుంది మా మధ్య ఆ ఉత్తరాల వల్ల! రచయితగా హిమాంశు కళ్ళకి కనిపించే ఆ ప్రపంచం చిత్రకారుడుగా నా కళ్ళకెలా కనిపిస్తోందో చూడాలి.

నాకెందుకో అనిపిస్తోంది ఆ ఊళ్ళో నాక్కావలసిన ప్రపంచం కనిపిస్తుందని. అందుకే అక్కడికి బయల్దేరి వస్తున్నట్లు ఉత్తరం రాయడంలో ఒక్క క్షణం ఆలశ్యం చెయ్యలేదు.

%% %% %%

"ఎలా వుంది మా ఊరు?" అడిగాడు హిమాంశు. ఇద్దరం చెరో ఎయిరు బాగూ భుజానికి తగిలించుకొని నడుస్తున్నాం. ఓ బాగునిండా నా బట్టలు. మరో బాగు నిండా పెయింటింగ్ సామగ్రి.

"ఇంకా పూర్తిగా చూడలేదుగా!" అన్నాను సాయంత్రపు నీరెండలో పొడుగ్గా పడుతున్న నా నీడని చూసుకుంటూ.

"భారత దేశాన్ని రిప్రజెంట్ చేసే ఈ ఊళ్ళో నీకు కావలసినన్ని దృశ్యాలు! ఓ పనిచేద్దాం. రేపొద్దున్నే బయల్దేరదాం. ఊరంతా నిన్ను తిప్పుతాను. నీ కుంచెకు పనికల్పించే ఓ దృశ్యం నీకు తప్పక కనిపిస్తుంది. ఎన్నాళ్ళనుంచో నేను చూస్తున్న ఆ దృశ్యం నీ కళ్ళకెలా కనిపిస్తుందో చూస్తాను" ఏదో ఆలోచిస్తున్నట్టు అన్నాడు హిమాంశు. "నా క్కావలసిన దృశ్యమేదో నీకు తెలిసినప్పుడు పొద్దున్న నుంచి సాయంత్రం దాకా తిరగడమెందుకూ? తిన్నగా ఆ దృశ్యం కనిపించే చోటుకే తీసికెళ్ళొచ్చుగా?" అడిగాను. చిన్నగా నవ్వాడు హిమాంశు. "ఓ రచయితగా ఆ దృశ్యాన్ని ప్రపంచం ముందు పెట్టలేకపోయాన్నేను. ఎలా పెట్టాలో తెలియలేదు. ఓ చిత్రకారుడిగా ఆ దృశ్యాన్ని నువ్వు ప్రపంచం ముందు ఎలా పెడతావో చూడాలనుంది... అంతేకాదు పొద్దున్న లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకోబోయే దాక చూసే ఎన్నో దృశ్యాల్లో నన్ను కదిల్చిన ఆ దృశ్యమే నిన్నూ కదిల్చిందో లేదో చూడాలి!" అతని మాటల్లో ఏదో కనీకనిపించని దిగులు...

హిమాంశు నాకు చూపించబోయే ఆ దృశ్యం ఎలాంటిదో ఊహించుకొంటుంటే ఆ రాత్రి నిద్రే పట్టలేదు నాకు.

%% %% %%

పువ్వులు... పువ్వులు... కనుచూపు మేరంతా పువ్వులే! అన్నీ పొద్దు తిరుగుడు పువ్వులే!... కలలు కనే కన్నెపిల్లల్లా తూర్పు ఆకాశంవైపు ఓరగా చూస్తూ! నిల్చొన్న చోటు నుంచి దిగంతాల దాక ఆకుపచ్చ,





పసుపచ్చ రంగుల కలనేత
చీర పరిచినట్లు! అందాల
చీరకి కుట్టిన జరీ బుటాల్లా
కుదుళ్ళ నుంచి సుళ్ళు
తిరుగుతూ పారుతున్న నీళ్ళు.
దూరంగా నీలి కొండల
మధ్య చిన్న నీటిపాయ... ఎంతసేపు చూసినా తనివి తీరడం లేదు.

"ఇదేనా నువ్వు చెప్పిన దృశ్యం?" అడిగాను.

"చెప్పనన్నానుగా! నేను రాత్రి దాకా చూపించే దృశ్యాల్లో నీక్కావలసినది నువ్వే ఎన్నుకో! రేపొచ్చి బొమ్మ వెయ్యొచ్చు."

మరోక్కసారి ఆ అందాలన్నిటిని మనసులో బంధించేసుకొని వెనక్కు తిరగబోతుంటే మనస్సులో చిన్న

అంజిడి... ఎక్కడో ఏదో అసంతృప్తి వున్నట్లు! అప్పుడు తెలిసింది అదేమిటో! పొలాలకి మరోవైపు దూరంగా చిన్నగా కనిపిస్తూ ఫ్యాక్టరీ గొట్టాలు... ఆ గొట్టాల్లోంచి పైకి లేస్తూ పొగ...

మాగాడ కదుతున్న పాలమీద చిన్న ఉప్పురాయి వేసినట్లు చిన్న అసంతృప్తి.

"అది సన్‌ఫ్లవర్ ఆయిల్ తయారు చేసే ఫ్యాక్టరీ" అన్నాడు హిమాంశు.

నిన్న హిమాంశు చెప్పిన దృశ్యం ఇదేనా?

అంత అందం వెనకా ఆ కృత్రిమత్వం వుంది కాబట్టి ఇది కాదేమో! వుంది కాబట్టే ఇదే నేమో? బరువైన మనసుతో ముందుకి కదిలాము.

%% %% %%

ఇదిగో ఇది కల్పతరు కాలనీ... ఇందాక మనం మాసిన ఫ్యాక్టరీ తాలూకుదే! ఇక్కడందరూ ఆ ఫ్యాక్టరీలో పనిచేసేవారే" అన్నాడు హిమాంశు.

ఆ కాలనీలో ఇళ్ళన్నీ ఒక్కలాగే వున్నాయి...

ఇళ్ళముందు తాళ్ళమీద ఆరేసిన బట్టలూ... ఇళ్ళలో తిరుగుతున్న మనుషులూ...మనుషుల మొహాల మీద అతికించుకున్న చిరునవ్వులూ...మనుషుల నడక ల్లోని పరుగులూ... మనుషుల కళ్ళలోని అలసటా... అన్నీ కూడా ఒక్కలాగే వున్నాయి. మధ్యతరగతి బతు కుకు ప్రతిబింబాల్లా.

పొద్దున్నా, మధ్యాహ్నం తిన్న వద్దన్నమే మళ్ళా రాత్రి కూడా తినవలసొచ్చినప్పుడు కలిగే భావన!

ఈ కాలనీ సగటు భారతీయుడి బతుక్కి ప్రతి నిధిలా నిలుస్తుందేమోగానీ... అందరికీ తెలిసిన విష యాన్నే నేను కొత్తగా చూపించేదేముందీ?

ఊహూ... ఈ కాలనీ మాత్రమే చూపించడానికి తీసుకు రాలేదేమో! ఇక్కడే ఎక్కడో ఏదో వుంటు ంది...

ఇద్దరం ఇళ్ళమధ్యనున్న రోడ్డుమీంచి నడుస్తున్నాం. మధ్యాహ్నపు ఎండ మెడవెనక భాగాన్ని చురుక్కు మనిపిస్తోంది.

"అదిగో అటు చూడు..." హిమాంశు చూపిం చాడు.

ఎదురుగా జంక్షన్లో పెద్ద రావి చెట్టు కిందుగా కట్టిన సిమెంటు అరుగుమీద కూర్చొని వుందామె.

"రోజూ ఈ టైముకి అక్కడే అలాగే కూర్చొనుం టుంది" అన్నాడు హిమాంశు.

ఇద్దరం మరికొస్త ముందుకు నడిచాం. ఇప్పుడామె స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె పైట భుజం చుట్టూ తిప్పి కప్పుకొనుంది. కప్పుకొన్న పైట చాటునుంచి కనిపిస్తూ. అనాచ్ఛాదితమైన స్తనం. ఆ స్తనాగ్రం ఓ పసిపాప పెద



వుల మీద... పసిపాప ఒంటిని కూడా కొస్త కొస్త కప్పుతూ ఆమె పైట...

ఆమె కళ్ళు పరవశంతో అరమోడ్చి వున్నాయి. చేతులు అతి సున్నితంగా పాప తలను నిమురుతున్నాయి. ప్రపంచంలో వున్న సంపదంతా తన కళ్ళముందే ఉన్నంత సంతృప్తి కొద్దిగా విచ్చుకొన్న ఆమె పెదిమల్లో!

వీటన్నిటి మధ్యా ఆమె చిరిగిన చీరా... చింపిరి తలా... మట్టి కొట్టుకొని వున్న ఒళ్ళు కనిపించడం లేదు!

మరికొస్త ముందుకెళ్ళి ఆమె వైపు పరిశీలనగా చూసి ఉలిక్కిపడ్డాను.


ఆమె ఒళ్ళో వున్నది ప్రాణమున్న పసిపాప కాదు... ప్రాణం లేని ఓ రబ్బరు బొమ్మ!

"పద!" అన్నాడు హిమాంశు భుజంమీద చెయ్యేసి ముందుకి నడిపిస్తూ. శక్తంతా ఉడిగిపోయినట్లు ముందుకి కదిలాను.

"ఆమె పిచ్చిది" అన్నాడు ఏదో కొత్త విషయం చెప్తున్నట్లు.

"చిన్నప్పటి నుండీనా?" అడిగాను.

"కాదు...'కల్పతరు' ఫ్యాక్టరీలో ఆమె మొగుడు పనిచేసేవాడు. ఆ కాలనీలోనే వుండేవారు వీళ్ళు. ఓసారి




ఫ్యాక్టరీ ప్రమాదంలో ఈమె భర్త చనిపోయాడు. ఆ యాక్సిడెంటు ఫ్యాక్టరీకి సంబంధించినది కాదని ఫ్యాక్టరీ వాళ్ళు తేల్చేశారు అప్పటికామెకి నెలం పిల్లాడు. భర్త పోయిన కొన్నాళ్ళకే ఆ పిల్లాడు పోయాడు. అంతే... అప్పట్నించి పిచ్చిదైపోయింది. పాపం పుట్టింటి వారూ ఎవరూ లేరట... పిల్లాడి కోసం కొన్న ఆ పెద్ద రబ్బరు బొమ్మని అలా ఒళ్ళో వేసుకొని కూర్చుంటుంది. ఎవరైనా పిలిచి ఏమైనా పెడితే తింటు ంది!"

నా మనసు బరువుగా అయిపోయింది. అయ్యో పాపం పిచ్చి బతుకు అని జాలి పడాలా? పిచ్చిదైపోయి అంత సంతృప్తి అనుభవిస్తున్నందుకు తృప్తి పడాలా?

అన్నిటికీ మించి ఆ కళ్ళలోని పరవశత్వం...చేతి వేళ్ళ చివరి కదలికలలోని సున్నితత్వం, పెదవుల మీది చిరునవ్వులోని నిర్మలత్వం... అన్నీ కూడా ఓ రెండు గంటల కుంచె కదలింపుతో ఓ అద్భుతమైన అను భూతిని కలిగించే చిత్రంగా మారిపోతాయని సంతోషిం చాలా?

కానీ... పుట్టిన ప్రతి ప్రాణీ అనుభవించే మాతృ ప్రేమని నేను కొత్త కోణంలోంచి చూపించే దేముంది?

చిరిగి వెలిసిపోయిన చీరెకి కాంట్రాస్టుగా కనిపించే మొహంలోని సంతృప్తి?

మాతృ ప్రేమలోని గొప్పదనాన్ని చూపించే ప్రయత్నంలో మనిషిలోని దీనతనాన్ని తప్పనిసరిగా చూపించాలా? అలా చూపిస్తే తప్ప ఆ గొప్పదనం అర్థం కాదా?

పక్కన నడుస్తున్న హిమాంశు వైపు చూశాను. నిర్వికారంగా నడుస్తున్నాడతను.

%% %% %%

సాయంత్రపు నీడలు పొడుగ్గా పరుచుకొంటున్న వేళ...

"ఇప్పుడు నువ్వో అద్భుతమైన కళాఖండంలాంటి ఇంటిని చూడబోతున్నావ్" అన్నాడు హిమాంశు రోడ్డు మలుపు తిరుగుతూ.

రోడ్డు మలుపు తిరగ్గానే అర్థమైపోయింది హిమాంశు మాటల్లో ఒక్క పిసరు అబద్ధం లేదని. మాగాడ రంగూ ఇటుక రంగుల కలయికతో ఆ ఇంటికి వేసిన రంగే ఎంతో ఆహ్లాదంగా వుంది. ఇంటికంటే అందంగా వుంది ఇంటి ముందున్న గులాబీ తోట. అన్ని రంగుల గులా బీలు నేనెక్కడా చూడలేదు. ఇంటికి వెనకగా దూరంగా కొండల చాటుకి వెళ్ళిపోతూ సూర్యుడు! సాయంత్రపు నీరెండ ఆ ఇంటిని మరింత అందంగా అలంకరించే స్తోంది.

"లోపలికెళ్దాం పద" అన్నాడు హిమాంశు గేటు తెరుస్తూ.

"వీళ్ళు నీ స్నేహితులా?" అన్నాను అతని వెనకే లోపలికి నడుస్తూ.

"స్నేహితుల్లా కాదూ పాడూ కాదూ కొస్త పరిచయమంతే! వీళ్ళ అబ్బాయికి నేను ట్యూషను చెప్తుంటాను. బాగా చెప్తానని ఇంట్లో వాళ్ళకి కొస్తో

కూస్తో అభిమానం అంతే''

గేటు దగ్గర్నుండి ఇంటి వరండాకున్న పాలరాతి మెట్ల దాక వేసిన నల్ల నాపరాతి బండల బాటకి రెండు వైపులా గుండ్రంగా కత్తిరించిన క్రోటన్ మొక్కలు... ఇద్దరం పాలరాతి మెట్లెక్కి వరండాలోకి నడిచాం.

వరండా స్తంభాలకి అల్లుకుపోయిన తీగెల్లాంటి బోగన్‌విల్లా పూలు...ఒక్కో స్తంభానికీ ఒక్కో రంగువి! అన్నీ రంగుల కలయికనీ నేను అపురూపంగా చూస్తుండగా ఇంట్లోంచి పన్నెండేళ్ళ పిల్లాడు పరిగెత్తుకొని వచ్చాడు.

''రండి సార్...రండి'' అన్నాడు సంభ్రమంగా.

ఇద్దరం లోపలికి నడిచాం.

హాలంతా కలియజూశాను. నేలమీద పరిచిన కాశ్మీరు తివాసీ దగ్గర్నుంచీ షోకేసులోని దంతపు బొమ్మల వరకూ అన్నీ ఖరీదైనవే! అన్నీ అందమైనవే!

అంత ఆధునికమైన డ్రాయింగ్ హాల్లోనూ ఓ మూల చలికాచుకొనే 'హార్త్' ఎర్రగా కణకణలాడుతున్న బొగ్గుల మీంచి చిన్న ఎర్రటి మంటలు...గదంతా వెచ్చగా చేస్తూ...

ఇల్లంతా అలుముకొని గంధపు సువాసన...

కాసేపయ్యాక ఆ అబ్బాయి నాన్న వచ్చాడు. నన్ను పరిచయం చేశాడు హిమాంశు.

''సో...మీరు పెయింటరన్నమాట...మా ఇంటిదీ తోటదీ ఓ పెయింటింగ్ వెయ్యకూడదూ?'' అన్నాడు ఖరీదైన చిరునవ్వు అందంగా నవ్వుతూ.

చిన్నగా నవ్వేశా నేను. కాస్సేపుపాటి మాటలయ్యాక ''ఎట్టీ మీ సారుకి ఇల్లంతా చూపించవూ?'' అన్నాడాయన.

''పదండి సార్'' అన్నాడా అబ్బాయి.

ఇంట్లో ఒక్కో గదీ... ఒక్కో గదీ చూస్తుంటే... లక్ష్మీదేవి చాలా నిర్లక్ష్యంగా ఇల్లంతా తిరిగేస్తూ తన కాలి మువ్వల్ని ఇల్లంతా విరజిమ్మేసినట్లనిపించింది.

ఇల్లంతా తిరిగి మళ్ళా హాల్లో కొచ్చేసరికి పెద్ద ట్రేలో రెండు పెద్ద వెండి పళ్ళాలతో ఫలహారాలు సిద్ధంగా వున్నాయి. ఇద్దరికీ చెరో ప్లేటూ అందించాడు అబ్బాయి.

ప్లేట్లోని పదార్థాలని చూసి అదిరిపడ్డాను.

పాలకోవా, గులాబ్‌జామ్, జాంగ్రీ, జీడిపప్పు పకోడీ, ఆమ్లెట్, సేమ్యా ఉప్మా...

''ఇప్పుడివన్నీ తినలేనండీ'' అన్నాను మొహమాటంగా.

''భలేవారే...పోనీ తినగలిగినవే తినండి... అయినా మీ గురించి కొత్తగా ఇప్పుడేం చేయించలేదు సేమ్యా ఉప్మా తప్ప! మిగతా అన్నీ ఇంట్లో వున్నవే! మీకు కంపెనీ ఇవ్వాలనుంది కానీ నాకు డయాబిటీస్. తిన కూడదు. మీరు కానీయండి'' అన్నాడాయన సోఫాలో విలాసంగా వెనక్కి చేరబడి.

ఆ ఫలహారాల పళ్ళాలను చూస్తున్న హిమాంశు కళ్ళలో అయిష్టతో మరేదో భావం... ప్లేటుని టేబుల్ మీద పెట్టేసి జీడిపప్పు పకోడీ నొకదాన్ని చేతిలోకి తీసుకొన్నాడు. నేనూ అంతే చేశాను.

%% %% %%

గేటు తీసుకొని బయటికొస్తుంటే అన్నాడు హిమాంశు ''ఆయనెవరో తెలుసా... పొద్దున్న మనం చూసిన 'కల్పతరు' ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టరు. కంపెనీలో షేర్స్ అన్నీ ఆయనవీ, ఆయన బంధువులవే! మనం చూసిన ఆ పొద్దుతిరుగుడు పూలతోటా ఆయనదే!''

''అనుకొన్నానులే!'' అన్నాన్నేను.

''సరే నీకు తర్వాతి దృశ్యం చూపించే లోపున ఓ కథ చెప్పాలి''

''చెప్పు'' అన్నాను కుతూహలంగా.

''ఈ రంగనాధరావ్ నాన్న ఓ చిన్న వ్యాపారస్థుడు. కిరాణా సామాన్ల వ్యాపారం చేసేవాడట. వడ్డీకి అప్పులు కూడా ఇచ్చేవాడట.''

మామూలు కథే!

''కొద్దో గొప్పో వ్యవసాయం కూడా వుండేదట. ఇత్తడి బిందె దగ్గర్నుంచి బంగారపు తాళి బొట్టు దాకా దేన్నయినా తాకట్టుగా తీసికొనే వాడట. 'అసలు' సంగతి అలా వుంచి వడ్డీ మీద వడ్డీ పెరిగి... ఆఖరికి ఆ వడ్డీ కూడా కట్టలేని పరిస్థితులలో ఆ వస్తువు అతని స్వంతమై పోయి తిరిగి అది పొలం కింద మారగా... పదేళ్ళలోనే అతని పదెకరాల పొలమూ వంద ఎకరాలుగా మారిందట'' చెప్పుకు పోతున్నాడు హిమాంశు.

ఇదీ మామూలు కథే!

''తాకట్టు పెట్టిన వస్తువు కొంత అప్పుని తీర్చగా వెట్టి చాకిరీ కొంత అప్పుని తీర్చేదట''

''ట... ట... అనక్కర్లేదేమో...ఇది దేశమంతా జరుగుతున్న కథే'' అన్నాను నవ్వుతూ.

''సరే అయితే టాటాలు తీసేస్తాను'' తనూ నవ్వుతూ అన్నాడు హిమాంశు.

''చెప్పు'' అన్నాను.

''తమకున్న కాస్తంత ఆస్తినీ తాకట్టు పెట్టేసి ఇంకా అప్పు తీరక అతని పొలంలో వెట్టి చాకిరీ చేసిన వాళ్ళలో కొమరయ్య, మల్లయ్య కూడా వున్నారు.''

''వాళ్ళిద్దరేనా?'' అడిగాను.

''వాళ్ళు కూడా'' అన్నాను! ''ఇంకా చాలా మంది వుండేవారు. కాని వాళ్ళిద్దరి గురించే ఎందుకు చెప్పానో నీకు కాస్సేపయ్యాక తెలుస్తుంది'' అన్నాడు హిమాంశు.

కుతూహలం మళ్ళా పెరిగింది. ఆసక్తిగా చూశాను హిమాంశువైపు.

''వందెకరాల పొలమూ తండ్రి చేతుల్లోంచి ఈ రంగనాధరావు చేతుల్లో కొచ్చేసరికి అతనికి సరికొత్త ఆలోచన పుట్టుకొచ్చింది. అప్పటికే వెట్టి చాకిరీని రద్దు



చేసేసింది ప్రభుత్వం. వరి జొన్నలూ పండించే పొలంలో పొద్దుతిరుగుడు పూల తోట వేశాడు. ఇంకా బాంకుల్లో డబ్బంతా పెట్టి 'సన్ ఫ్లవర్ ఆయిల్' ఫ్యాక్టరీ తెరిచాడు.''

''బాగుంది'' అన్నాను.

''తన దగ్గర వెట్టి చాకిరీ కున్న వాళ్లందరికీ తన ఫ్యాక్టరీలోనే పనిచ్చాడు ఈ రంగనాధరావు. మిగతా వాళ్ళలాగే వీళ్ళకీ జీతాలిస్తాడు...కాకపోతే వెట్టిచాకిరీకి బదులు అప్పు తీరేదాక ఫ్యాక్టరీలో ఓ షిఫ్టు ఎక్కువ పనిచెయ్యాలి!''

''కానీ... దానికి వాళ్ళెలా ఒప్పుకున్నారు? ఎలాగూ ప్రభుత్వం వెట్టి చాకిరీని రద్దు చేసింది కదా... మరో చోట పనిచూసుకోవచ్చుగా?''

''మరో చోట ఎక్కడ చూసుకొంటారు? ఊళ్ళో భూములన్నీ ఇతనివే... ఫ్యాక్టరీ ఇతనిదే... మరో పని చూసుకోవాలంటే పొట్ట చేత బట్టుకొని మరో ఊరికి పోవాలి. అక్కడ ఏదో ఒక పని దొరుకుతుందని నమ్మకం లేదు. పోనీ కాస్తో కూస్తో జీతం దొరుకుతుంది కదా... ఎప్పటికో ఒకప్పటికి అప్పు తీర్చలేక పోతామా అని వీళ్ళూ ఒప్పేసుకున్నారు!''

''కానీ ఈ యూనియన్లూ... లేబర్ కోర్టులు అన్నీ




కూడా ఇవన్నీ చూస్తూ..."

నా మాట పూర్తికాకుండానే అందుకొంటూ అన్నాడు హిమాంశు "ఓ చిన్న ప్రైవేటు ఫర్మ్‌కి యూనియన్లెక్కడివి? తోటి పనివాళ్ళకి అన్నీ తెలిసినా చూసీ చూడనట్టు వూరుకుంటారు. నెల తిరిగేసరికి నికరంగా అందే ఆదాయాన్ని వదులుకుంటారా? పైగా ఆ ఓవర్‌టైంకి ఎక్కడా రికార్డు వుండదు. జీతమూ వుండదు. ఓవర్ టైంకి ఇవ్వదలిచిన ఆ జీతం ఏ కాగితం మీదికి ఎక్కకుండానే కట్టకుంటిన పద్దు కింద జమయిపోతుంటుంది!"

"పాపం!" అన్నాను. అది చాలా చప్పనైన మాటని తెలిసినా.

సరే... కొన్నాళ్ళు ఫ్యాక్టరీ బాగానడిచి అతనికి బోల్డు లాభాలు సంపాదించి పెట్టింది. కానీ ఓ-రోజు డీజిల్‌తో నడిచే ఓ జనరేటర్ అంటుకొని ఫ్యాక్టరీలో చాలా మిషన్లూ... రా మెటీరియలూ అంటుకుపోయాయి."

"మై గాడ్...తర్వాత?"

"తర్వాతేముందీ [illegible] రంగనాథరావుకి పూర్తి ఉపయోగపడింది. తిరిగి ఫ్యాక్టరీలోకి కొత్తరకం ఆటోమాటిక్ మిషన్లు చేరిపోయాయి. ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్ళకి ముట్టిన [illegible] వాళ్లు హాయిగా పండుకొన్నారు. కానీ పిటీ ఏమిటో తెలుసా ఫ్యాక్టరీ కాలిపోతున్నప్పుడు అందులో పనిచేస్తూ ఇందాక నేను చెప్పిన ఆ కొమురయ్యా, మల్లయ్యా కూడా వున్నారు. వాళ్ళిద్దరూ అక్కడికక్కడే కాలిపోయి చచ్చిపోయారు. అప్పటికి సెకండ్ షిఫ్టు పూర్తయిపోయి కొన్ని నిమిషాలయింది. ఏదో కొద్దిగా పని మిగిలిపోతే వాళ్ళు చేస్తున్నారట!"

"చాలా దారుణం కదూ?"

"ఇంకా దారుణం ఏమిటో తెలుసా? వాళ్ళు ఓవర్ టైం చేస్తున్నట్లు ఎక్కడా రికార్డుల్లో లేదు! వాళ్ళు అన్ ఆథరైజ్డ్‌గా అక్కడున్నారనీ...అందువల్ల ఆ ప్రమాదంలో చనిపోవడం వాళ్ళు పనిలో వుండగా చనిపోవడం కింద లెక్కలోకి రాదనీ...అందువల్ల కాంపెన్సేషన్ ఇవ్వక్కర్లేదని అనేవాడు రంగనాథరావ్. లేబర్ కోర్టు కూడా అతని మాటల్ని బుద్ధిగా ఒప్పేసుకొంది."

"......" మౌనంగా అతని మాటల్ని వింటున్నాను.

"సరే ఇంక అసలు విషయం చెప్పనా? చనిపోయిన ఆ ఇద్దర్లోని ఆ కొమురయ్య పెళ్ళామే ఇందాక మనం చూసిన ఆ పిచ్చిది."

ఒళ్ళు చిన్నగా జలదరించింది. అంతకు ముందే రంగనాథరావింట్లో తిన్న ఒక్కో పకోడీ ముక్కా తుప్పు పట్టిన కత్తిగా మారి పొట్టలో పేగుల్ని చీలుస్తున్నట్లు అనిపించింది.

"పద... తర్వాతి దృశ్యం చూపిస్తాను..."

%% %% %%

ఆకాశంలో మొదటి చుక్క కనిపించింది. చిరు చీకట్లో రోడ్డు మీద మనుషులందరూ నడుస్తున్న నీడల్లా కనపడుతున్నారు.

"శ్మశానాన్ని చూస్తే నీకు భయమా?" అడిగాడు హిమాంశు.

"ఎప్పుడో చిన్నప్పుడు శ్మశానం పక్కనించి నడుస్తుంటే విపరీతమైన భయమేసేది. ఇప్పుడు పోయిందిలే! ఇంకా చెప్పాలంటే ఒక్కోసారి శ్మశానాన్ని చూస్తుంటే భక్తిగా కూడా అనిపిస్తుంది"

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు హిమాంశు.

"ఎందుకా?...ఆ శ్మశానం గొప్పవాడూ, బీద వాడూ...హరిజనుడూ, బ్రాహ్మడూ...ఆడదీ, మగాడు అన్న భేదాల్లేకుండా అందర్నీ ఒక్కలాగే ట్రీట్ చేస్తుంది కాబట్టి!"

నా జవాబుకి బిగ్గరగా నవ్వాడు. నవ్వాక గంభీరంగా అన్నాడు.

"కానీ...ఇప్పుడు మాత్రం నేను చూపించే దృశ్యం చూసి నువ్వు భయపడతావేమో!"

"అంత భయంకరంగా వుంటుందా ఆ దృశ్యం?"

"భయంకరంగా వుంటుందో...దుఃఖకరంగా వుంటుందో అసహ్యకరంగా వుంటుందో నువ్వే చూద్దువుగాని...పద."

ఇద్దరం శ్మశానం గేటు దాటి లోపలికి నడిచాం. అంతా చీకటి...అంతా నిశ్శబ్దం...నెమ్మదిగా నడుస్తున్నాం మేము.

దూరంగా ఏదో చితి మంట...చాలా సేపట్నించి మండి మండి మరి కాసేపటికి ఆరిపోయే స్థితిలో!

నాకెందుకో రంగనాథరావు ఇంటి డ్రాయింగ్ హాల్లోని 'హార్త్' జ్ఞాపకం వచ్చింది.

ఆ చితి మంట చుట్టూ ముగ్గురు నలుగురు మనుషులు కూర్చొని వున్నారు. దూరం నించి మంటల వెలుగులో ఎర్రగా వాళ్ళ మొహాలు మాత్రమే కనిపిస్తున్నాయి. చనిపోయిన వారి తాలుకు బంధువులు కాబోలు...మంట ఆరిపోయే స్థితికొస్తున్నా దాన్ని వదల్లేక దగ్గరే కూర్చొన్నారు. బాధగా నిట్టూర్చాను. కాని మరికొన్ని అడుగులు ముందుకేసేసరికి ఆ బాధ దిగ్భ్రమగా మారిపోయింది.

ఆ మంట చుట్టూ కూర్చున్న మనుషులు అందులో కాలుతున్న శవాన్ని గురించి ఏడవడమూ లేదు. ఆ చితి మంటని చలి మంటగా వేసుకొని చలి కాచుకోవడమూ లేదు.

ఆ చితి మంట మీద వంట వండుకొంటున్నారు. అక్షరాల వంటొండుకుంటున్నారు.

మంటల మీద పెట్టిన కుండలోంచి సల సలమని అన్నం ఉడుకుతున్న చప్పుడు...చితిలోంచి వస్తున్న పొగతోబాటు అన్నపు కుండలోంచి వస్తున్న ఆవిరి కూడా కలిసిపోయి అక్కడికక్కడే చిన్న పొగ మేఘం!

ఓ తల్లీ ముగ్గురు పిల్లలూ... చిరిగి పీలికలైపోయిన బట్టల్ని చీకటి సగం సగం దాచేస్తుంటే మంటల వెలుగు మాత్రం వాళ్ళ మొహాల మీద వికృతంగా నాట్యం చేస్తోంది. వాళ్ళు నలుగురూ కూడా మా వైపు చూడ్డం లేదు... ఆ మంటల వైపూ చూడ్డం లేదు. ఆ అన్నపు కుండంవైపే చూస్తున్నారు.

కొన్ని నిమిషాల క్రితం హిమాంశు నాతో అన్నట్టు... నాలో కలిగిన ఆ భావం భయమో, దుఃఖమో, అసహ్యమో నాకే తెలియదు.

రెండు నిమిషాలలా మౌనంగా నిశ్శబ్దంగా వెనక్కు తిరిగాడు హిమాంశు. అనుసరించాను నేను.

"శ్మశానంలో చితి కాలినప్పుడల్లా వాళ్ళు దానిమీదే వంట చేసుకొంటుంటారు" నిర్వికారంగా అన్నాడు హిమాంశు. నేనేం మాట్లాడలేను. ఆ దృశ్యం షాక్ నుంచి తేరుకోలేను. మరో అయిదు నిమిషాల నడక తర్వాత అడిగాడు హిమాంశు. "నీ బొమ్మ సంగతలా వదిలేయ్... ఇప్పుడు మనం చూసిన దృశ్యం ద్వారా కవయిత్రిగా జనానికి నేనేం చెప్పగలనో చెప్పు చూద్దాం!"

"ఓ మనిషి చావు మరొకరి బతుకులో ఓ పూట వంట చెరకు ఖర్చుని తగ్గిస్తోందని!"

"అంతేనా?" నిరాశగా అన్నాడు హిమాంశు.

"వాళ్ళ జీవితాల్లో వున్న 'బతుకు భయం' చావు భయాన్ని దూరంగా తరిమేస్తుందని!"

"అంత చిన్న విషయమా?"

ఆక్రోశిస్తున్నట్లు అన్నాడు హిమాంశు.


నాకు కొన్ని గంటల క్రితం చూసిన రంగనాధరావు ఇల్లూ, అతనిచ్చిన పంహారాలూ గుర్తొచ్చాయి.

" 'హేవ్స్' కీ 'హేవ్ నాట్స్'కీ వున్న స్పష్టమైన తేడా!" నా మనస్సులో ముద్రించుకు పోయిన చిత్రం వంద శాతం స్పష్టంగా వుందన్న ఆత్మ విశ్వాసంతో అన్నాను.

"సరే ఇంకో విషయం చెబుతాను. అప్పుడు చెప్పు నీ జవాబు... ఇప్పుడే చితి మంటలమీద వంటొండుకుంటున్న ఈ ఆడదీ ముగ్గురు పిల్లలూ ఎవరో తెలుసా? ఫ్యాక్టరీలో కొమరయ్యతో బాటు కాలిపోయిన మల్లయ్య భార్యా, పిల్లలూ!"

ఆ దృశ్యాన్ని చూసిన దగ్గర్నుంచి మనసులో అస్పష్టంగా కదులుతున్న మూడు భావాలూ ఒక్కసారిగా ఏకమైపోయి మనసుని కుదిపేశాయి.

అంతకు కొన్ని గంటల ముందు తిన్న ఒక్క పకోడీ కడుపులో గిర్రున తిరిగి వికార పెట్టేసింది. కడుపు లోంచి వస్తోన్న వాంతిని ఆపుకోలేదు నేను!




నేను చిత్రించవలసిన దృశ్యమేమిటో తెలిసిపోయింది నాకు!

ఆ చిత్రాన్ని ప్రపంచం ముందు ఎలా పెట్టాలో కూడా తెలిసిపోయింది!

%% %% %%

చితిమంటలు...

ఒకటి కాదు...రెండు కాదు...వందలు వేలు...

ఆ చితి మంటల్లో కాలిపోతూ మనుషుల్లా కనిపిస్తున్న శవాలో, శవాల్లా కనిపిస్తున్న మనుషులో తెలియకుండా కొన్ని ఆకారాలు...

మంటల మధ్యలోంచి కూడా స్పష్టంగా కనిపిస్తూ ఆకారాల మొహాల్లో ఆకలి...నిస్సహాయత...బతుకుత యుద్ధం...

మంటల మీద ఆవిర్లొస్తూ పెద్ద పెద్ద గిన్నెల్ల వంటలు...ఆ వంటలను చూస్తూ మంటల చుట్టూ కూర్చున్న వాళ్ళ మొహాల్లో వికృతమైన ఆనందం...

వాళ్ళ పక్కనే పెద్ద పెద్ద పళ్ళాలలో గులాబ్ జామూన్లు...పాల కోవాలు...జీడిపప్పు పకోడీలు.. శవాల్లా కాలుతున్న మనుషుల ఒంటిమీది బట్టల పీలికలై వున్నాయ్...

మంటల చుట్టూ కూర్చున్న వాళ్ళ బట్టలు మంట వెలుగులో ధగధగా మెరిసిపోతున్నాయ్...

చితి మంటల్లో కాలిపోతున్న వాళ్ళ మొహాల్లో నేనూ హించుకున్న కొమరయ్య, మల్లయ్యలూ, నాకు తెలిసిన వాళ్ళ భార్యల పోలికలు...

చితి మంట మీద వండుకొంటున్న వాళ్ళ మొహాల్లో రంగనాధరావు పోలికలు...

చిత్రాన్ని చూస్తున్న హిమాంశు నెమ్మదిగా వా భుజాన్ని నొక్కి వదిలేశాడు.

"నేను చూపించలేని దాన్ని నువ్వు చూపించగలి గావ్!" అన్న సంతృప్తి అతని మొహంలో! ●




# సంతానం లేనివారికి శుభవార్త!

1938 సం. నుండి ప్రఖ్యాతిగాంచిన డా. కేబీస్ ఫార్ములా మందులు "సంతానామృత రసాయనము" సేవించిన వంధ్యత్వము నివారించి స్త్రీల రజోదోషములు, పురుషుల శుక్రదోషములు పోగొట్టి "సంతాన యోగ్యత" కలిగించును. నూతన యవ్వనము పొంది దాంపత్య జీవితమును సుఖమయము చేసుకొనుటకు, సంతానము కలుగుటకు, చర్మవ్యాధులకు, సుఖవ్యాధులు (VD) గనేరియా వ్యాధులకు ఆయుర్వేద చికిత్సకై సంప్రదించండి. * పోస్టు ద్వారా చికిత్స చేయబడును *

డాక్టర్ కె. బాలయ్య (Govt. Regd) ఆయుర్వేద విద్వాన్, సంతాన కేంద్రము, హెల్త్ క్లినిక్, నంద్యాల-518501

కేబీస్ ఫార్ములా మందులు సేవించి సంతానము పొందిన వారి వివరములు

1. డేవిడ్ సుందరం, హెల్త్ అసిస్టెంట్, పి. ఆత్మకూరు, నంద్యాల (TQ)
2. M. వెంకటేశ్వర్లు, A.P.S.E.B., ఆత్మకూరు - కర్నూలు జిల్లా
3. G. నాగిశెట్టి, మర్చంట్, 26-345 A-Peta, కర్నూలు
4. M. వెంకటేశ్వర్లు, R.I. తాలూకాఫీసు, పులివెందుల P.O., కడప జిల్లా
5. P.పాలయ్య, R.T.C. కండక్టర్ - ఒంగోలు
6. S. హనుమంతరావు, H.M., తిమ్మసముద్రం P.O., ఒంగోలుజిల్లా
7. P. ఓబయ్య, U.D.C., తాలూకాఫీసు, ఆళ్లగడ్డ - కర్నూలు జిల్లా
8. B.N. సవారన్న, C.T.O. ఆఫీసు, కర్నూలు
9. దంతా జానకిరామయ్య Land Lord, ముజ్జుగూడెం, Via నేలకొండపల్లి P.O. ఖమ్మం జిల్లా
10. B. శివప్రసాద్, క్వార్టర్ నెం.71, 3rd Block, న్యూపోలీసు లైన్స్, హైదరాబాద్.

ప్రతి నెల పర్మనెంట్ క్యాంపులు ప్రతి నెల : 29, 30 తేదీలు గుంటూరు శ్రీ అజంతా లాడ్జిలో సరస్వతి సినిమా హాలు ఎదురుగా
ప్రతి నెల : 2, 3 తేదీలు హైదరాబాదు న్యూ వసంత విహార్ లాడ్జిలో అబిడ్స్ సెంటర్, G.P.O. వెనుక

SHAH ADS.